క్లుప్తంగా

హైస్కూల్‌లో ఘనంగా కొమురం భీమ్ జయంతి



దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో కొమురం భీమ్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొమురం భీమ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కాళిదాసు మాట్లాడారు. కొమురం భీమ్ జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కొమురం భీమ్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్నె బాబు, నరేందర్, ఊర్మిళ, ఇంద్రసేనారెడ్డి, రమేశ్, రామదాసు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం, లక్నెపల్లి, రామవరం, రాజపల్లి, స్వామినాయక్‌తండా, రాములునాయక్‌తండా గ్రామాలకు విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన బానోత్ మోహన్‌నాయక్ నర్సంపేటకు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా బదిలీ అయిన సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మహేశ్వరం గ్రామ రైతులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధికార ప్రతినిధి మచ్చిక రాజుగౌడ్ మాట్లాడారు. మోహన్‌నాయక్ విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించారని అభినందించారు. కార్యక్రమంలోబీసీ నాయకులు మిర్యాల కుమారస్వామి, కంజర్ల అమిన్, పులుగుల సంజీవరెడ్డి, బోళ్ల భాస్కర్, మేక శ్రీకాంత్, నల్ల రాజు, మహేశ్వర యూత్ క్లబ్ నాయకుడు బొల్లెపల్లి రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజినీకాంత్



ఖానాపురం : బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బుధరావుపేటకు చెందిన నందగిరి రజినీకాంత్‌ను నియమించినట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో రజినీకాంత్‌కు నియామకపత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం రజినీకాంత్ మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా సతీశ్



ఖానాపురం : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంగళవారిపేటకు చెందిన ఎన్‌పోశబోయిన సతీశ్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సతీశ్‌కు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నియామకపత్రాన్ని మంగళవారం అందజేసారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడారు. ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి నిజాయితీ

నల్లబెల్లి : పొరపాటున తన నంబర్‌కు ఫోన్ పే ద్వారా వచ్చిన డబ్బును యువకుడు సంబంధిత వ్యక్తికి తిప్పి పంపించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన పెండ్యోట చంద్రమోహన్ ఫోన్ పే నంబర్‌కు చేవెళ్ల మండల కేంద్రానికి చెందిన దుర్గం శ్రీధర్ తన కుటుంబ సభ్యులకు బదులు పొరపాటున మంగళవారం రూ.15 వేలు ఫోన్ పే చేశాడు. అనంతరం పొరపాటును గుర్తించిన శ్రీధర్ విషయాన్ని చంద్రమోహన్‌కు ఫోన్ ద్వారా వివరించగా చంద్రమోహన్ తిరిగి ఫోన్ పే చేశాడు.

నేటి నుంచి శిక్షణ

చెన్నారావుపేట : మండలంలోని మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు (వాటర్‌మెన్‌లకు) నేటి నుంచి 26వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రణధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు జిల్లా, నర్సంపేట డివిజన్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు హాజరవుతారని వివరించారు.

తరగతి గదుల నిర్మాణమెప్పుడో..?

- నిధులు మంజూరు చేసి మూడు నెలలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట సర్వాపురంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణమెప్పుడో..? అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మూడు నెలలు గడచినా కనీసం శంకుస్థాపనకూ నోచుకోని దుస్థితి నెలకొంది. ఎస్సీ కాలనీ ప్రజలను వేదనకు గురి చేస్తున్న సమస్యపై 'సాక్షి' కథనం..

సర్వాపురం ఎస్సీ కాలనీలో 40 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం రెండు గదులతో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసింది. నాటి నుంచి విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. విద్యార్థులతో పాఠశాల కళకళలాడగా 20 ఏళ్లకు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురిస్తే నీరు గదుల్లోకి రావడం లాంటి సమస్యలతో తాత్కాలిక మరమ్మతుల కింద 15 ఏళ్ల క్రితం గదులకు స్లాబ్ పోశారు. స్లాబ్ రెండేళ్లకు మించి ఉండకపోవడంతోపాటు పెచ్చులూడడంతో ఒక గదిని కూల్చారు. మరో గదిలోనే తరగతులు నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సమస్యను 'వానొస్తే.. బడి బంద్' శీర్షికతో ఈ ఏడాది జూలై 1న 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా ప్రభుత్వం స్పందించింది. తరగతి గదిపై స్లాబ్ కూల్చి రేకులు వేసే పని కోసం రూ.3.80 లక్షలు, మెస్ కాంపౌండ్‌కు రూ.3.80 లక్షలు మంజూరు చేసింది. కాగా వెంటనే తరగతి గదిపై స్లాబ్ కూల్చి రేకులు వేసే పని పూర్తి చేశారు. మెస్ కాంపౌండ్ పనులు ప్రారంభించగా స్థానికులు రెండుగా విడిపోయి గొడవ పడడంతో తాత్కాలికంగా నిలిపేశారు. పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. మూడు నెలలు గడిచాయి. అయినా ఇప్పటివరకు నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేపట్టలేదు. ఆగస్టులో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామంటూ శిలాఫలక గద్దె సైతం నిర్మించారు. కాగా వర్షాలు కురుస్తుండడంతో శంకుస్థాపన నిలిచిపోయింది. అనంతరం శంకుస్థాపన చేస్తామన్నా పలుమార్లు వాయిదా వేశారు. ఇప్పటివరకు శంకుస్థాపన కూడా నోచుకోని దుస్థితి నెలకొంది. ఇకనైనా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి శంకుస్థాపన, తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గదుల నిర్మాణం కోసం చదును చేసిన ప్రదేశం



శంకుస్థాపన కోసం నిర్మించిన గద్దె

పనుల ప్రారంభానికి కృషి చేస్తా



తరగతి గదుల నిర్మాణ పనుల ప్రారంభానికి కృషి చేస్తా. రెండు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. శంకుస్థాపన కోసం శిలాఫలకం ఏర్పాటుకు గద్దె నిర్మింపజేశాము. గదుల నిర్మాణానికి భూమి చదును చేయించాము. శంకుస్థాపన కోసం ఏర్పాటు చేయగా అనివార్య కారణాలతో వాయిదా పడింది. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో పనులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటా.

-కొర్ర సారయ్య, ఎంఈఓ, నర్సంపేట

బీసీలపై చిన్నచూపు సరికాదు



అశోక్



కృష్ణంరాజు

నర్సంపేట : బీసీలపై పాలకులు చిన్నచూపు చూస్తుండడం సరికాదని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అన్నారు. పట్టణంలోని బీసీ పవర్ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు సుభాశ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి రాజు హాజరై మాట్లాడారు. బీసీల హక్కులకు భంగం కలుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ జీఓ నంబర్ 29 ద్వారా బీసీ విద్యార్థుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని విమర్శించారు. బీసీ పవర్ బలోపేతం కోసం గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. మహేశ్వరం గ్రామానికి చెందిన బూస కృష్ణంరాజును మండల అధ్యక్షుడిగా, ఖానాపురం మండలం మనుబోతులగడ్డకు చెందిన ఆబోతు అశోక్ యాదవ్‌ను నియోజకవర్గ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మచ్చిక రాజుగౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వరంగంటి కవిత, డివిజన్ అధ్యక్షురాలు గాదం స్వప్న, రేఖ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొమ్మ శ్రీకాంత్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు మటం కన్నీ, తదితరులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్ద ఉత్సవాలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అజయ్, నాయకులు

నర్సంపేట : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 24న తలపెట్టిన పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ కోరారు. ఉత్సవాల వాల్‌పోస్టర్లను పట్టణంలోని ఎస్‌ఆర్ ఒకేషనల్ కళాశాలలో మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు పాలనను వ్యతిరేకిస్తూ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. సంఘం విద్యార్థుల పక్షాన ఉద్యమాలు నిర్మిస్తోందని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, ప్రశాంత్, ప్రవీణ్, కల్యాణ్‌సాయి, సుదర్శన్, వీరేశ్, పవన్, కల్యాణ్, సాయిరాజు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో కాలయాపన సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణ చేయకుండా కమిషన్ల పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఎంఎస్‌పీ రాష్ట్ర ప్రతినిధి బిర్రు మహేందర్ అన్నారు. మండలంలోని ఇల్లందలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. తానే వర్గీకరణ చేస్తానని, అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తుండగా ఇంకా కమిటీలు, కమిషన్ల పేరుతో మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ చేయకుండానే గ్రూప్–1, గ్రూప్–2తోపాటు డిసెంబర్ నాటికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేసే పనిలో ఉన్నారని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న వరంగల్‌లో తలపెట్టిన ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తాండ్ర రాజేందర్, మైదం సంతోశ్, సత్తుపెల్లి సారయ్య, రత్నాకర్, రాజు, పరశురాములు, అనిల్, అనిల్‌కుమార్, సారంగపాణి, బాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'ను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

నర్సంపేట : విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు కంభంపాటి ప్రతాప్ కోరారు. జమ్మికుంటలో శిక్షణ పూర్తి చేసుకున్న వారితో మంగళవారం ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు ఆరు రోజుల పాటు రోజుకు రూ.500 చొప్పున ఇస్తూ శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వృత్తికి సంబంధించి రూ.15 వేల విలువైన కిట్ ఉచితంగా అందించడతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.3 లక్షల రుణం ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని 18 ఉపకులాల చేతివృత్తుల ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి పంజాల రాము, వల్లాజి నరేందర్, ముత్యాల సాంబయ్య, సామల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ రాజ్యాధికార సమావేశం

గూడూరు : మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం బీసీ రాజ్యాధికార సమావేశం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు సమితి జిల్లా బాధ్యుడు పెదకాసు కుమారస్వామి, రాష్ట్ర బాధ్యుడు కట్ల విష్ణుగౌడ్ తెలిపాడు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలోని సబ్బండ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

దామెర : అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ చెప్పారు. దామెర క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. గూడెప్పాడ్ నుంచి హనుమకొండకు టిప్పర్‌లో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అక్రమంగా మొరం, మట్టి తరలించొద్దని స్పష్టం చేశారు.

తల్లి, కూతురు అదృశ్యం

నర్సంపేట రూరల్ : తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. మాదన్నపేటకు చెందిన గనిపాక సదానందం–సంధ్యారాణి దంపతుల నడుమ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 2న గొడవ జరగడంతో సంధ్యారాణి చిన్న కూతురు తేజను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సదానందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన గూడ చిరంజీవి ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబానికి అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు మంగళవారం రూ.50 వేల సాయం అందజేశారు. తొలుత చిరంజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదె హేమలత రవీందర్‌రెడ్డి, చిరంజీవి స్నేహితులు సంపత్‌కుమార్, డీఎంకే.స్వామి, శివరంజన్, భూక్య నీలిమ, కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలోజీ, చక్రు తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..



మండలంలోని కాట్రపల్లికి చెందిన పంచాయతీ కార్మికుడు గాదరి యాకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య మంగళవారం రూ.5 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత యాకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గిర్క సురేశ్, రాజేందర్, భాస్కర్, డాక్టర్ శ్రీను, అజిత్, బూడిద శ్రీధర్, గుండ్లపెల్లి అశోక్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

వర్ధన్నపేట : కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలైన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. స్థానిక మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు గారె కొమురమ్మ ఉదయం రోడ్డు ఊడుస్తుండగా అంబేడ్కర్ సెంటర్ వద్ద వరంగల్ నుంచి వస్తున్న కారు జఫర్‌గఢ్ రోడ్డుకు మలుపు తిరుగుతుండగా ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో కొమురమ్మ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొమురమ్మకు ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఖానాపురం : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన మండలంలోని అయోధ్యనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని డీఫ్లోరైడ్ ప్రాజెక్టులో నీటి వినియోగం కోసం ఓ రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు పలు చోట్ల అతుకులుండడంతో పక్కనున్న ఇనుప కంచెకు తగిలి విద్యుత్ సరఫరా అవుతుండగా అయోధ్యనగర్‌కు చెందిన శ్రీరామోజు రుక్మాచారికు చెందిన గేదె ప్రమాదవశాత్తు ఇనుప కంచెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె మేతకు వెళ్లి రాకపోవడంతో రుక్మాచారి, అతడి కొడుకు వెళ్లి మృతి చెందిన గేదెను పరిశీలిస్తుండగా వారికి సైతం విద్యుత్ షాక్ తగిలింది. మృతి చెందిన గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు రుక్మాచారి తెలిపారు. అతుకులున్న విద్యుత్ తీగలను నిర్లక్ష్యంగా వదిలేసిన రైతుపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని రుక్మాచారి కోరాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రుక్మాచారి చెప్పారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



చెన్నారావుపేట : ఉద్యమ కార్యాచరణ కరపత్రాలను ప్రదర్శిస్తున్న బాలాజీరావు, తదితరులు



రాయపర్తి:నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయపర్తి : ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ గౌడ్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు, తిర్మలాయపల్లి, తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆ సంఘం తలపెట్టిన ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని కాట్రపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో వెంకటరమణ ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం తమ సమస్యలు నిర్లక్ష్యం చేయగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో పరిష్కారమవుతాయని ఆశించామని, 10 నెలలు గడచినా పట్టించుకోవడం లేదని చెప్పారు. పీఆర్‌సీ ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేస్తామని, నవంబర్ 5న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని, అదే నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష పేరుతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సంఘాలకు అతీతంగా ఆందోళనల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో ఆ సంఘం బాధ్యులు ఏవీఆర్.ఆచార్యులు, బిల్ల రవికుమార్, వివి.ఆచార్యులు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమ కరపత్రాలను ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పిన్నింటి బాలాజీరావు, మండల అధ్యక్షుడు తంగళ్లపల్లి రమణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు డీఏ, పీఆర్‌సీతోపాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28 నుంచి తలపెట్టిన ఆందోళనలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

మున్సిపల్ పరిధిలో సమస్యల తిష్ట



వినతిపత్రం ఇస్తున్న సారంగపాణి, తదితరులు

నర్సంపేట : నర్సంపేట మున్సిపల్ పరిధిలో సమస్యలు తిష్ట వేశాయని వినియోగదారుల మండలి అధ్యక్షుడు సారంగపాణి, కార్యదర్శి యుగంధర్ తెలిపారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణిలకు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య లోపం నెలకొందన్నారు. చెత్తాచెదారంతో మోరీలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. మార్కెట్ యార్డు సైతం సమస్యలకు నిలయంగా మారిందని చెప్పారు. పారిశుద్ధ్య లోపంతో దోమల బెడద ఎక్కువ అయ్యిందని వివరించారు. స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు సైతం లేవని చెప్పారు. పట్టణ ప్రజలకు మున్సిపల్ సేవలు అందని దుస్థితి నెలకొందన్నారు. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించేలా మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

నర్సంపేట : పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని స్థానిక సీఐ రమణమూర్తి కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ఫ్లాగ్‌డే సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులు సేవలను స్మరిస్తూ పాటలతో ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులు చిరస్మరణీయులని చెప్పారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధి నిర్వహణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులతోపాటు ఎస్సై అరుణ్, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మేనేజర్ మోహన్‌కాంత్

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన రైతు దాసరి బాలస్వామి ఇటీవల మృతి చెందగా అతడి భార్య రత్నమేరీకి మంజూరైన రూ.3 లక్షల జీవిత బీమా చెక్కును ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్ బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడారు. బాలస్వామి బ్యాంకులో ఖాతా కలిగి ఇటీవల పంట రుణాన్ని తీసుకున్నాడని చెప్పారు. లైఫ్ ఇన్సూరెన్స్ కూడా చేయించుకున్న క్రమంలో ఆయన మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కట్ట స్వామి, క్యాష్ ఆఫీసర్ నవనీత్ చారి, సిబ్బంది సదిరం రాజు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గూడూరు : మండలంలోని మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఆర్.శంకరన్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య మాట్లాడారు. శంకరన్ గిరిజనాభివృద్ధితోపాటు బడుగుల ఉన్నతికి కృషి చేశారని కొనియాడారు. శంకరన్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోకాళ్ల వెంకన్న, మేడ వసంత, బాలయ్య పాల్గొన్నారు.